# సంస్కారము

శ్రీ నెల్లూరి కేశవస్వామిగారు

"అమ్మాయీ ! నీ పేరు ?"

"శ్యామాబాయట. కాని నన్నందరూ 'శ్యామా' నే పిలుస్తారు."

"అయితే శ్యామా ! నీకీ నాట్యమూ, గానమూ ఎవరు నేర్పారు ?"

"రోజూ ప్రొద్దున మా ఇంటికొక పంతులొస్తాడు, అతనే నాకు నేర్పేది."

"చాలా బాగా నాట్యం చేస్తావు శ్యామా ! నిన్న నన్నక్కడ చూశావా ?"

"ఊఁ......చూశాను."

"అయినా నే నెవరో నీకేం తెలుసు ?"

"అప్పటివరకు తెలీదు కాని తర్వాత తెలుసుకున్నాను."

"ఎట్లా ?"

"నిన్న మీ ప్రక్కన ఓ ముసలాయన నిలబడ్డాడు చూడండీ."

"ఆ ?......ముసలాయనా ?......ఏమో లే చెప్పు."

"అతను మా యింటిప్రక్కన వుంటాడు. నేనాయన్ని తాతయ్యాని పిలుస్తాను. ఆయనే చెప్పాడు. మీరు బాబూ రామ్‌నాథ్ జమీందారువారి కుమారులనీ, మీ పేరు బాబూరామ్ మోహన్ అనీ...... అదేదో పట్నంలో చదువుతారనీ ప్రస్తుతం శలవుల్లో ఇంటికొచ్చారనీ......నిజమేనా బాబూ గారూ ?"

శ్యామతో నేను మొదటిసారి నదీతీరాన కలుసుకున్నప్పటి ప్రసంగం. చిన్నప్పటి సంగతి.

* * *

సంధ్యాకాలం. పడమటికొండలమీద ఇంకా ఎరుపు నిలిచివుంది. పక్షులు జంటలు జంటలుగా తమ గూళ్లను చేరుకుంటున్నాయి. పశువులు మందలు మందలుగా ఏటొడ్డుకు వస్తూన్నాయి. నదీతీరాన ఇసుకదిబ్బలమీద మేము కూర్చుని వున్నాము.

"అయితే, నువ్వు ప్రతిరోజూ నాట్యం చేయాలా, శ్యామా ?"

"ఊహుఁ......తిరునాళ్లోగానీ, అంగళ్లోగానీ లేక పర్వదినాల్లోగానీ చేయాల్సొస్తుంది. అప్పుడు పైక మెక్కువ దొరుకుతుందట."

"ఆ వొచ్చేపైక మెవరు తీసుకుంటారు ?"

"మా అమ్మా, నాన్నా."

"ఎవరూ ?......నిన్న నీప్రక్కన నిలబడ్డవాళ్లేనా ?"

"ఊఁ"

ఇక మాట్లాడలేకపోయాను. మాట్లాడాలని కుతూహలముందికాని ఏం మాట్లాలో తెలీలేదు. నా ఈ స్థితి గమనించి గామాలు శ్యామే అందుకుంది.

"మీ రిక్కడ ఇంకా ఎన్నాళ్లుంటారు ?"

"సుమారు మూణ్ణాళ్లు."

కొంచంసేపు నిశ్శబ్దం.

"శ్యామా ! నీకింటిదగ్గిర ఎవరూ స్నేహితులు లేరూ ?"

"ఊహుఁ, నా దగ్గిరకు రావటానికి ఎవరూ ఇష్టపడరు. అసలు వాళ్ల తల్లులు రానివ్వరేమో."

"మరి, ఒక్కదానివి ఎట్లా వుండగలుగుతావు ?"

"మా ఇంటికో పత్రిక వస్తుంది. దాంతో నే కాలం వెళ్ళబుచ్చుతాను."

"అయితే, నీకుచదువుకూడావచ్చునా శ్యామా ?"

"అఁ ఏదో కాస్తవచ్చు. చిన్నప్పుడు నేర్చాను."

"మరి, శ్యామా ! రోజూ సాయంత్రమిక్కడికి రారాదూ. నాకూనూ ఇక్కడ ఎవ్వరూ స్నేహితుల్లేరు. ఇక్కడివాళ్లంతా నాకు వెఱ్ఱివెఱ్ఱిగా అవుపడ్డారు. నువ్వొస్తే ఇద్దరం కులాసారా కబుర్లు

చెప్పకోవచ్చు......ఏం, వస్తావా ?"

"..........ఆ......."

* * *

అప్పటినుండి ప్రతిరోజూ సాయంత్రం మే మిద్దరము నదీతీరాన కలుసుకునేవాళ్లం. దినమంతా ఏలా గడిచినా సాయంత్రంమాత్రం చాలా సరదాగా వుండేది. పట్నం విషయాలను, మా కాలేజీ విషయాలను ప్రతిరోజూ ఏకరువు పెట్టేవాణ్ణి. ఆమెమాత్రం విసుగు లేకుండా శ్రద్ధతో వింటూండేది. ఒక్కొక్కప్పుడు, నా బలవంతంమీద, శ్యామ పాడేది. ఆమె పాడ్తూంటే నన్ను నేనే మరచిపోయేవాణ్ణి.

ఇల్లా గడిచేయి మారోజులు.

## ౨

కొన్నాళ్లకు శ్యామ అకస్మాత్తుగా రావటం మానేసింది. కారణం బోధపడలేదు. ఎక్కడేనా నాట్యానికి పోయివుంటుందని వూరుకున్నాను కాని మరుసటిరోజుగూడా శ్యామ రాలేదు. నా ఆతుర్దా హెచ్చయింది. పోనీ, తెల్లవారన్నా వస్తుందేమో ననుకున్నాను. మూడోరోజూగూడా శ్యామజాడ లేదు. ఇహ ఆగలేకపోయాను...కాని, ఆగక ఏం చేసేది ? నా దురదృష్టానికి తోడుగా, శ్యామ ఇల్లు నాకు తెలీదు. నే నెన్నడా మెనడుగనూ లేదు, ఆమె చెప్పనూ లేదు. శ్యామ తల్లి పేరుమాత్రం తెలుసు. కాని ఎవర్నడగనూ ?...వేశ్యఇంటితో నాకేం పని? వారికి అనుమానం కలగదూ?...ఇహ ఏం చేయాలో తోచలేదు.

నాలుగోరోజున వూరంతా గాలించటం మొదలెట్టాను. కాని ఎవ్వర్నీ అడుగలేదు. నా ప్రయత్నమంతా వృథా అయిపోయింది. అయిదోరోజు ప్రొద్దున ఏదో పనిమీద ఓ బజారులోంచి పోతూంటే, అకస్మాత్తుగా శ్యామ నాకంటబడ్డది. ఓ ఇంట్లోంచి పరుగెత్తుకొస్తూంది. అప్రయత్నంగా నా నోటినుండి "శ్యామా !" అని వెలువడింది.

శ్యామ నన్ను ఆశ్చర్యంతో చూచింది. మరుక్షణం తలవంచుకుంది.

"శ్యామా ! నువ్విక్కడా ?" ఆశ్చర్యంతో అడిగాను.

మెల్లిగా అంది, "అవును...ఇదే మాఇల్లు."...తలెత్తింది. ఆమెకళ్లలో నాకు రెండు నీటిచుక్కలవుపడ్డాయి. నేను చకితుణ్ణయిపోయాను.

"ఇదేమిటి శ్యామా ! ఎందు కేడుస్తున్నావు ?"

తలవంచుకొని మెల్లగా అంది, "కొట్టింది."

"ఎవరు ?"

"మా అమ్మ."

"మీ అమ్మ ?...ఎందుకు ?"

దీనికి ప్రత్యుత్తరం లేకుండానే, "సాయంత్రం" అంటూ రివ్వున ఇంట్లోకి పరుగెత్తింది. నేను నిశ్చేష్టుణ్ణైపోయాను. నాకేమీ పాలుపోలేదు......కాని ఒక్కసారి నాకు స్ఫురణకొచ్చింది నే నే యింటి ముందు నిలబడ్డానో, అక్కడినుండి తిన్నగా జారుకున్నాను.

ఆ దినమంతా చాలా కష్టంగా గడిచింది. సాయంత్రం కాగానే గమ్యస్థలం చేరుకున్నాను. ఓ ఇసుక తిన్నెపైన చతికిలపడ్డాను. ఆలోచనలతో నా తల తిరిగిపోతోంది. మాటిమాటికి ప్రొద్దటిదృశ్యం కళ్ళెదుట కట్టినట్టవుపడ్తోంది. ఆ బెదిరిక చూపులు, ఆ దీన వదనం, ఆ కన్నీళ్లు...జ్ఞాపకం చేసుకుంటే కడుపు తరుక్కుపోతూంది...కాని ఆ తల్లి—ఆ కఠినురాలికి ఎట్లా చేతులు వచ్చాయో ఆ ముగ్ధను కొట్టడానికి ? ఇష్టం లేకున్నా నాట్యం చేయాలి, పాట పాడాలి, వారికి సంపాదించిపెట్టాలి. పైనుంచి—ఇంత యీడొచ్చినా—ఇంకా దెబ్బలుకూడానా ? తాను మాత్రం రోజూ ముస్తాబౌతుంది, కాని ఒక్క రోజన్నా శ్యామకు మంచి చీర కట్టుకోడానికి ఇచ్చినట్టవుపడదే! తిండికూడా సరిగ్గా పెడ్తుందో లేదో?...

ఇవన్నీ కన్నతల్లి చేష్టలేనా ?......

"మోహన్ బాబూ !"

తిరిగిచూశాను. నవ్వుమొహంతో శ్యామ నిలబడి వుంది.

"వచ్చావా శ్యామా ?"

ముందుకొచ్చి కూర్చుంది. నా మొహం చూడ గానే బొమలు ముడిచేసింది. "ఇదేమిటి, మోహన్ బాబూ ! మీ రేడుస్తున్నారా ? మీ కళ్లలోంచి నీళ్లేమిటి ?" నా కంతవరకు తెలీదు నే నేడుస్తున్నా నని. కళ్లు తుడుచుకున్నాను.

"ఎందుకు చింతిస్తున్నారు ? ఏమిటి మీ రాలో చించేది ?"

మెల్లిగా అన్నాను. "ఇవ్వాళ్లటి విషయమే ఆలో చిస్తున్నాను శ్యామా ?"

తలత్రిప్పింది. "ఊఁ అదెప్పటి సంగతే బాబూ గారూ !" నిరాశతో నిట్టూర్చింది. మళ్లీ అంది, "కాని మీరు దానికోరకు చింతిస్తూ, మనసు పాడు చేసుగోకండి."

"శ్యామా ! మీ అమ్మ నిన్నెప్పుడూ కొడ్తూం టుందా !"

శ్యామ అవునన్నట్టు నావేపు దీనంగా చూసింది.

"మరి, ఒక్కసారైనా నాతోటి చెప్పావు కావేమి ?"

"సార్థకం ?"

"ఏమీ, సార్థకమా ? ఊఁ...అయితే ఈ నరకా న్నుండి నీకిక విముక్తి లేదనేనా నీయూహ ?"

"అంతే అనుకుంటాను"

"ఎందుకిట్లా అధైర్యపడతావు ?"

"మరేం చేయమంటారు నన్ను ?"

శ్యామనుచూస్తే జాలేస్తోంది. నా హృదయంలో ఆందోళన ఎక్కువైంది. ఆలోచనా సముద్రంలో కొట్టుకుపోతూ వున్నాను. తీరిగ్గా, సావధానంగా, ఆలోచించడానికి వ్యవధిలేదు. తృటిలో నిశ్చయించు కోవాలి...కానేపటికి దృఢనిశ్చయంతో అన్నాను.

"శ్యామా ! నీవీ చెరసాల్లో ఎప్పటికీ వుండలేవు, వుండకూడదు...విముక్తిమార్గం ఓటుంది. లేదని నిరాశపడకు...చెప్పనా శ్యామా ?"

"ఊఁ ! చెప్పండి." మెల్లిగా అన్నాను, "నేను నిన్ను రక్షిస్తాను".

"ఎట్లా ?"

"నిన్ను పెళ్లాడి-"శ్యామ చిన్నగా నవ్వింది.

"మీ భ్రమ బాబూగారూ ! నేనో వేశ్యనని మరిచిపోయారా ?......మావు పెళ్ళిళ్ళు కావు—కావుట మా తాతయ్య చెప్పాడు. అసలు మమ్మల్ని చేపట్టితే చాలు, సంఘం వాళ్లని వెలివేస్తుందట..."

"కాదు శ్యామా ! అట్లాకాదు. మనుష్యుల్తోనే సంఘంకాని సంఘంతో మనుష్యులుకారు. సంఘం మనల్ని వెలివేస్తే, మనం సంఘాన్ని వెలివేయవచ్చు. అప్పుడు ఏ నిర్బంధమూ లేకుండా స్వతంత్రజీవులంగా బ్రతకవచ్చు...ఏం ?"

"పొరపడుతున్నారు బాబూగారూ ! మీ రిది వరకే పలువురికళ్ళల్లో పడ్డారు. అదేకారణంచాత నన్నీ నాల్గురోజుల్నుంచీ మీ దగ్గరికి రాకుండాచేసింది మా అమ్మ. ప్రతిరోజూ ఉపన్యాసాలు మొదలెట్టింది. కాని నాకవేమీ బోధపడేవికావు......మమ్మల్ని ప్రేమించేట్టు ఒకర్ని చేయాలిట కాని ఒకర్ని మేం ప్రేమింపకూడదట...ఒకర్ని మావల్లో పడేయాలిట కాని ఒకరివల్లో మేం పడకూడదట; మేం పురుషుల ఆటపట్టువులా ఉపయోగపడాలిటగాని మాలో హృదయం వుండదట—వుండకూడదట......"

"చాలు శ్యామా ! నువు వేయిచెప్పు, లక్షచెప్పు నిన్ను వివాహమాడి, నిన్ను రక్షించితీరుతాను... ప్రతిజ్ఞ చేయమంటావా శ్యామా ?"

శ్యామ తలవంచుకుంది.

"శ్యామా ! నే నన్న పసికుర్రాడిమాటలు గావు. రెండురోజుల్లో నా చదువు పూర్తవుతుంది, ఓ గొప్ప

పుద్యోగంలో ప్రవేశిస్తాను. అప్పుడు......"

"పెళ్ళవుతుంది" నవ్వుతూ అందుకుంది శ్యామ.

"ఆఁ...అవును. పెళ్లవుతుంది...తప్పక అవుతుంది...శ్యామతో."

శ్యామ మొహం వికసించింది.

## 3

మరుసటిరోజు కాస్త ప్రొద్దెక్కి లేచాను. నా దృష్టి మేజామై నున్న ఓ క్రొత్త కవరుమీద పడ్డది. తొందరగా తీసిచూసాను. కవరతికించలేదు. ఉత్తరం తీసి చదవడ మారంభించాను:

"మోహన్ బాబూ !

అంతా తారుమారై పోయింది. నే నింటికొచ్చే సరికి మా వాళ్లంతా సిద్ధంగా వున్నారు, ఈ వూరు నుండి ప్రయాణం కట్టడానికి...అదేదో పట్నమట—ఇక్కడికి చాలాదూరమట—అక్కడికెళ్ళి మా వృత్తి నారంభిస్తారట. అర్థరాత్రివేళ బయలుదేరటంలో వాళ్ల ఉద్దేశమేమిటో నాకేమీ తెలీటంలేదు. ఇప్పుడు—పదకొండైంది—మీ తుది దర్శనంకోసరం వచ్చాను. కాని భాగ్యం లేకపోయింది. మీరు నిద్రలో నున్నారట. అందుకనే ఈ లేఖవ్రాసి మీ జవానుచేతికిస్తున్నాను.

ముందు నాకు ఏఏకష్టాలు, ఏఏ అనుభవాలు కలుగనున్నవో, నా భవిష్యత్తుకే తెలుసు. మీరు మాత్రం మీ ప్రతిజ్ఞని మీ జ్ఞాపకవీధిలో నుంచితిరా నాకదే పదివేలు. తర్వాత దైవసంకల్పం. ఉంటాను. నమస్కారాలు.

మీ అభాగిని
శ్యామ."

నిశ్చేష్టుణ్ణైపోయాను. చేతిలోంచి కవరు జారిపోయింది. అశ్రువుల్తో నిండిపోయాయి కళ్లు. అక్కడే మంచంపైన చతికిలపడ్డాను.

ఏమిచేయాలో తెలీలేదు. ఇహ ఆ వూళ్లో వుండలేకపోయాను. శలవులు పూర్తికాక ముందే పట్నం చేరుకున్నాను. మొదట ఇక్కడకూడా చాలా బాధగా తోచింది. కాని కాలపరిణామం దుఃఖాన్ని మింగేస్తుంది. శ్యామజాడ కనిపెట్టాలని భగీరథ ప్రయత్నాలుచేశాను. ప్రతి గొప్ప గొప్ప పట్నంలో వున్న స్నేహితులకు వుత్తరాలు వ్రాసాను. కాని అంతా నిష్ఫలమవడంచాత, వూరుకున్నాను.

## 4

ఏళ్లుగడిచాయి. చదువుపూర్తిచేసుకొని యిల్లు చేరుకున్నాను. నౌఖరీచేయడమంటే మనస్సొప్పలేదు. మా వంశవృత్తా, నాకు మొదటికేనచ్చదు. అసలు నేను సంపాదనకు బూనుకునేంత అవసరమేమీ అవుపళ్ళేదునాకు. నాకేకొరతాలేదు. మా నాన్న కాస్త చదువుకున్నాడు. పిచ్చిపిచ్చి నమ్మకాలుగానీ, మూఢాచారాలుగానీ అయనకుగిట్టవు. కాబట్టి నాస్వంతవిషయాల్లో నాకు సంపూర్ణ స్వాతంత్ర్యమిచ్చాడు. ఇన్ని విధాల అనుకూల పరిస్థితులుగల నాలాంటివాళ్లన్నా సంఘసంస్కరణ కోసరం పాటుపడకపోతే, దేశమేలాగా అభివృద్ధిపొందుతుంది? అనిఅనుకొని సంఘసంస్కరణకు దేశాటన మారంభించాను. దేశీయులముందు సాంఘికంగా బాగుపడాలన్న దృఢసంకల్పంతో ప్రచారం సాగించాను.

ఒకసారి మధురాపురంవెళ్లి రహదారి బంగళాలో బసచేసాను. దినమంతాఆవూరివాళ్ళకొందరితోప్రసంగించటంలో సరిపోయింది. సాయంత్రం ఆరింటికి, ముందువసారాలోని యీజిచెయిర్ లో కూర్చొని, ఆ మరుసటిరోజున ఇవ్వబోయే ఉపన్యాసాన్ని గురించి ఆలోచించు కుంటున్నాను. ఇంతలో ఎదుటి మేడలోంచి సంగీతంవినపడ్డది. నాకు సంగీతమంటే చాలాసరదా. నా ఆలోచనలన్నీ తారుమారై పోయినాయి. స్త్రీకంఠంలాగుంది. దాన్లోనిమాధుర్యం నన్ను పరవశుణ్ణిచేసి వేసింది. కాని ఆకంఠంలో మాధుర్యమొక్కటేకాక, ఏదో అని వార్యమైన విచారమూ

బాధాకూడా వున్నట్టు నాకు స్పష్టపడ్డది. ఇక అక్కడ నిలవలేకపోయాను.

వెంటనేలేచి ఆ మేడవేపు పరుగెత్తాను. మెల్లిగా కిటికీలోంచిపొంచి చూచాను. అగదిమధ్యన ఓనవ యౌవనవిలాసవతి కూర్చొని పాడ్తూంది. కొంచం దూరాన కొంతమంది పురుషులు—అన్ని తరహాల వారున్నారు—తలలూపుతూ ఆలకిస్తున్నారు. మొదటి చూపే తెలియజేసింది అదొక వేశ్యాగృహమని. కాని ఆయువతి మొహాన విచారసూచనలు అవుపడ్తున్నాయి ఎందుచేతనో?...అట్లా ఎంతసేపు నిలబడ్డానో ఆలోచించుకొంటూ నాకు తెలీదు. అకస్మాత్తుగా స్ఫురణ గలిగింది. నాలాంటిజాతీయనాయకులకు వేశ్యలయిళ్లల్లోకి పొంచిచూడటం భావ్యమేనా?......ముచ్చెమట్లు క్రమ్మాయి. దడదడలాడే హృదయంతో బస చేరుకొని యీజీచెయిర్‌లో చతికిలబడ్డాను.

పాట ఇంకా వినపడుతునేవుంది. అదేమాధుర్యం... అదే విచారం......అదేబాధ. నా హృదయాన్ని కలతపెట్టాయి. ఆయువతి ప్రతిమ కళ్లకు కట్టినట్టుంది. ఆమె ఎందుకు విచారపడుతుందో?...సంగీతంమీద ఇష్టంలేనట్టుంది. కాని పాడుతుంది...అవును ఆమె ఒక వేశ్యగా! ఇష్టంలేకున్నా ఆడాలి పాడాలి; దుఃఖంతో హృదయందహించుకుపోతున్నా ఏడవకూడదు ఎప్పుడూ నవ్వుతూవుండాలి; ఎంత నీచునితోనైనా సరసంగా మెలగాలి...నటన అంతానటన—వేశ్య జీవితమేనటన...ఆమె ఎట్లా భరిస్తుందో! ఎంతబాధపడుతుందో!! ఇక ఈ నరకంలోంచి ఆమెకు విముక్తిలేదూ? ఆమె బయటకురాదలిస్తే ఆమెకు చేయూతనివ్వగలిగే ఉదారస్వభావులు ఒక్కరూ ఈ విశాల ప్రపంచంలోలేరూ? ఏంలేక! సంఘం అంత గొడ్డుపోయిందా?...నేనే ముందంజవేసి సహాయం చేస్తేనో అమ్మో! నేనొక సంఘసంస్కారినని మొదట్లోనే పప్పులోకాలువేస్తే సంఘం నన్ను పరిహాసించదూ?...కాని నాలాంటి సంస్కారికి సంఘంతో భయమెందుకు? ఏం నా ఉద్దేశాన్నుంచి తొలగిపోతున్నానా? అదెట్లా అవుతుంది. ఇదిమాత్రం సంస్కారంకాదూ? ఒక అబలజీవితం పాడైపోతూ వుంటే చూస్తూ ఎట్లావూరుకోవటం?...ఇంతకూ ఆమెకు నిజంగా ఏదేనావిచారముందో లేదో? వున్నా నా సహాయాన్ని ఉపేక్షిస్తుందో లేదో? అయినా కనుక్కోవడంలో తప్పేముంది?...ఏమీ లేకపోతే ఎవరిదారివారిది.

౨

రాత్రి పదిఘంటలైంది. అంతాచీకటి. మొహానికి ముసుగేట్టుకొని ఆమేడ మెట్లెక్కుతున్నాను. 'ఎవరైనాగుర్తిస్తే'అనే ఆలోచనవచ్చేసరికి ముచ్చెమట్లు క్రమ్మాయి. తొందరతొందరగా మెట్లెక్కాను. పై ద్వారంవద్ద ఆయువతి నిలుచునివుంది. తెల్లటిచీర, నల్లజాకెట్టు ధరించివుంది. ఆభరణాలట్టేలేవు. కొన్ని మల్లెపూవులు మాత్రం చెదరిన జుత్తును అలంకరించాయి. ద్వారం దాటగానే తలుపు వేసేశాను. అటూ ఇటూచూచి ఓ సోఫాలో కూర్చున్నాను. కాసేపటికి ఆయువతి విదానంగావచ్చి నాకు రెండడుగుల దూరాన ఓచాపపైన కిళ్ళీలుకడ్తూ కూర్చుంది. అగదినంతా కలయచూచాను. చాలా అందంగా అలంకరించబడివుంది. వస్తువులు చాలా నేర్పుతో అమర్చబడివున్నవి. పడకగదిగామాలు ఓమూల పట్టుతెరతో ఓదోమ తెరమంచంవుంది. ఎలక్ట్రిక్ ఫాన్ విసరుతూవుంది.

"మోహన్ బాబూ!"

ఉలికిపడ్డాను. ఏదో పరచితకంఠం, ఏదో పరచిత పిలుపు. ఆమెమొహం తేరిపారజూశాను. ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం. ఎవరో జ్ఞాపకమొచ్చారు...కాని స్పష్టంగా పోల్చుకోలేకపోయాను.

"ఎవరూ?"

"నేను...నేను...మీ...శ్యామను..."

"శ్యామా ?"...... నా ఆశ్చర్యానికి అంతు లేదు...అవును ఆమె శ్యామే. అవే పోలికలు... అదే మొహం...కాని మార్పుంది...అప్పటి చిన్ని శ్యామ ఇప్పుడెదిగింది...యౌవనం తొలకాడుతోంది.

"నువ్విక్కడెట్లా వున్నావు శ్యామా ?"

"ఉత్తరంలో మాకు తెల్పలేదూ, మే మిక మా వృత్తిని ఆరంభిస్తామని ?... ముందు కలకత్తా కెళ్ళాము. తర్వాత ఇక్కడికి..."

"వాళ్ళేరీ ?"

"ఎవరూ ?"

"మీ అమ్మా, మీ నాన్నా"

"వాళ్ళా ?" శ్యామ తలవంచుకుంది. కొంచం సేపు మౌనం దాల్చింది. ఆ తర్వాత అంది.

"వాళ్లు...వాళ్లు నా తల్లి, తండ్రులుకారు బాబుగారూ !"

నాకు చాలా ఆశ్చర్యమేసింది, "ఏమిటీ ? వాళ్ళు నీ తల్లితండ్రులు కారా ?... నీ కెవరు జెప్పారు ?"

"ఆమెనే చచ్చేముందు చెప్పింది... పూనాలో నే నొకబీదకుటుంబంలో పుట్టానట. ఆ కొద్దిరోజులకే నా తల్లిదండ్రి ఇద్దరూ చనిపోయారట. నా కింకెవ్వరూ బంధువుల్లేకపోవటంమూలాన, వీళ్ళు నన్ను తెచ్చి పెంచుకున్నారట... ఆమె రైల్లక్రింద చనిపోయింది. అతనుకూడా పిచ్చెత్తి ఎక్కడికో వెళ్లి పోయాడు."

నా కొకవిధమైన సంతోషం కలిగింది గాని ఏం సార్థకం ? శ్యామను చూస్తే ఏడుపొస్తూవుంది.

"ఏమి టాలోచిస్తున్నారు బాబుగారూ"

"శ్యామా ! నీతో దూరమై ఏళ్ళు గడిచాయి గాని, ఇంతవరకు, నిన్నూ, నీతో చేసిన నా తుది వాగ్దానన్నీ మరవలేదు. ఆ ప్రతిజ్ఞే నన్నింతవరకు అవివాహితుణ్ణిగా వుంచింది."

"కాని...',

"కాని...ఏమిటి శ్యామా ?"

"బాబుగారూ ! ఇంతకుముందు ఏ భావంతో ఈ మేడ మెట్లెక్కారు ?" చకితుణ్ణయిపోయాను. ఆమెను నిజం ఎట్లా నమ్మించాలో బోధపళ్ళేదు. "పొరపడ్తున్నావు శ్యామా ! నా మాటలని నమ్ము. ఇవ్వాళ సాయంత్రం నిన్ను పాటపాడేప్పుడు చూశాను. నన్ను పోల్చుకోలేదు కాని ఏదో ఆబల విచారపడ్తూవుందని మాత్రంగ్రహించాను. నాచేతనైనంతమట్టుకు సహాయం చేద్దామని వచ్చాను. అంతేగాని శ్యామా ! వేరే అభిప్రాయమేమీలేదు. నిజం చెబుతున్నాను నమ్మవూ ?"

"నమ్ముతాను బాబూగారూ ! మీరు నాతో ఎప్పుడూ అనృతమాడరన్న నమ్మకం నాకుంది."

శ్యామకు నాపైన వున్న విశ్వాసానికి ఆశ్చర్యపోయాను. కాని ఆమెస్థితిని చూస్తే విచారం కలిగింది.

"విచారిస్తున్నారా బాబూగారూ ?... ఎందుకూ ?"

"మించిపోయింది శ్యామా ! మించిపోయింది" నిట్టూర్చాను.

"ఏమిటి ?"

"ఏమిటా ? అంతాను. నా ప్రతిజ్ఞను పూర్తిచేసుకోలేకుండా జేశావు.'.

శ్యామ తలవంచుకుంది. కాసేపటికి నా వైపు దీనంగా చూసింది.

"బాబుగారూ ! ......"కొంచంసేపు నిశ్శబ్దం. మళ్లీ "బాబుగారూ !"

"ఏమిటి శ్యామా ?"

"మీతో నిజం చెబుతాను. నమ్ముతారా ?"

"తప్పకా......నువెప్పుడూ అసత్యమాడవుగా శ్యామా !"

"మీరు నన్ను నమ్ముతారన్న దృఢవిశ్వాసముంది నాకు."

"అయితే, మరి, చెప్పు."

"బాబుగారూ! ......నేను......నేను......నేనింకా నిష్కళంకను."

నాకు చాలా ఆశ్చర్యమేసింది.

"నేనింకా చిన్నపిల్లవాణ్ణికానని, నీవు తెలుసుకుంటూ శ్యామా!"

"కాదు బాబుగారూ! నేనెన్నడూ అనృతమాడలేదు. ఇప్పుడుకూడా నిజం చెబుతున్నాను. నమ్మండి. మనమిద్దరం మునుపటి శ్యామా మోహనులమే."

"మురికిలో పెరిగి, మురికిలో నివసించి, మురికి తగలకుండా వుండడం అసంభవం శ్యామా!"

"కాదు బాబుగారూ! అందరూ ఒకేలాగు కాదు. గులాబీపుష్పం ఎంతటి గొప్ప ఉద్యానవనంలో పెరిగినా, ముండ్లతో వేరుకాలేదు. కానీ, కమలాన్ని చూడండి, ఎంతటి అసహ్యతగల మురికిలో పెరిగినా, మురికికీ దానికీ ఆవంతా సంబంధంలేదు."

నిరుత్తరుణ్ణయిపోయాను. శ్యామదీనవదనం నాప్రత్యుత్తరం కోసరం ఆశిస్తూవుంది.

"కాని శ్యామా! నువెన్ని చెప్పినా నా అంతరాత్మ నమ్మకుండావుంది."

శ్యామ మళ్ళీ తలవాల్చుకుంది. నేసంయోమయంలో పడ్డాను. నాకేటుతోచటంలేదు. శ్యామేఅనృత మాడుతుందో, లేకనేనే పొరపడుతున్నానో, తెలీకుండా వుంది. నీ శ్యామకళ్ళల్లోంచి నీటిబిందువుల రాలడం జూచి అదరిపడ్డాను.

"ఏడుస్తున్నావా శ్యామా?...ఏడుపెందుకూ?"

"మీరుకూడా నన్ను నమ్మలేకపోయారని, మీరు కూడా నన్ను గ్రహింపలేకున్నారని......" శ్యామ వెక్కివెక్కి ఏడవటం మొదలెట్టింది. నాకేటూ పాలుపోలేదు......తిరిగి గద్గదస్వరంతో సాగించింది:

"......మీనుండి వేరైనన్నుంచీ, ప్రతి క్షణమూ మిమ్మల్నే తలచుకుంటూ వుండేదాన్ని. నా శీలం కాపాడుకోవడంలో నాకు గల్గిన కష్టాలని మీరూహింపలేరు. కాని వాటినన్నిటినీ ఓర్పుతో భరిస్తూ వచ్చాను......ఒక్కొక్కప్పుడు జీవితంమీద రోత పుట్టేది. ఒక్కఆశ—మిమ్మల్ని ఎన్నటికైన కలుసుకుంటానన్న ఆశతో జీవించివున్నాను."

శ్యామ ఇక నిలవలేకపోయింది. ఏడుస్తూ వచ్చి నా కాళ్ళమైన పడ్డది.

ఇక నమ్మకుండా ఎట్లా వుండను?

"శ్యామా! ఇట్లా ఏడవటంవల్ల ఏం ప్రయోజనం? నేను మనఃపూర్వకంగా నీ మాటలను నమ్మాను. కాని ఇప్పుడేమి లాభం?"

"ఏం?"

"నేనిప్పుడొక జాతీయనాయకుణ్ణి, సంఘసంస్కారిని, నువు వేశ్యవని అందరికీ తెలుసు......"

"ఇప్పుడే కదూ బాబుగారూ! మీరిక్కడికి సంస్కారంకోరకొచ్చారన్నారు. ఇందులో వున్నది వేశ్య అనికూడా మీకు తెలుసునన్నారుగా?"... నే నిక మాట్లాడలేకపోయాను.

"బాబుగారూ! కాస్త ఆలోచించండి. మీపైనే ఆశపెట్టుకొని నరకంలోకూడా వుండి, జీవించుతూ వున్న ఓ అబలను రక్షించలేకున్న మీరెల్లాంటి సంస్కారులో నాకు బోధపడకుండా వుంది. మీసంస్కారము......"

"ఆగు శ్యామా! నేనిక వినలేను...నే నిశ్చయించుకున్నాను. నువు సిద్ధంగా వుండు రేపు రాత్రికే మనప్రయాణం......చాలా రాత్రయింది ఇక పోతా. రేపు మళ్ళీ కలుసుకుంటా, నువు మాత్రం సిద్ధంగా వుండు. విచారపడకు."

శ్యామ మొహం ఉత్సాహంతో వికసించింది. నేను నా బస చేరుకున్నాను.

## ౬

రాత్రిసంగతి ఎవరికీ తెలీనే లేదని నా నమ్మకం. కాని ప్రొద్దున్నే లేచేసరికి, నా బస ముందు గేటుకో పెద్దకాగిత మంటించి వుంది చదివాను :

"సిగ్గు! సిగ్గు!! సిగ్గు!!"

"అర్ధరాత్రివేళ వేశ్యల గృహాలుజొచ్చే నీచులంకూడా నాయకులనీ, సంస్కారులనీ, పిలవబడటం నీచం, అతినీచం. ఇల్లాంటి నీతిభ్రష్టులను వద్దకు చేరనివ్వకూడదు ఇట్టి మోసగాళ్ళ మాటలు వినగూడదు. వీళ్ల......"

ఇక చదవలేకపోయాను. దాన్ని చించి పారేశాను. అయినా ఈ సంగతి ఎంతమట్టు ప్రాకిందో తెలుసుకుందామని, బజారువేపుకు వెళ్ళాను. ఎటు వెళ్ళినా, నావేపే అందరూ వ్రేళ్ళు చూపెడుతూ, నాగురించే గుసగుసలు పెడ్తూన్నట్టు గోచరించింది. ఒకవేళ ఇది నా మతిభ్రమేమోనుకున్నాను. కానీ, నిన్న నాతో కులాసాగా మాట్లాడినవారుకూడా కొంతమంది, నన్ను చూచి తొలగిపోవటంచూచి అంతా గ్రహించుకున్నాను. నాకు భయం కలగలేదు. వున్న భయం కాస్తా తొలగిపోయింది. నాలో ఓ నూతనోద్రేకం రేకెత్తింది.........సరాసరి శ్యామఇంటికి దారితీశాను.

పగలు పదిగంటల సమయం. అవే మెట్లెక్కుతున్నాను. కాని అంధకారంలేదు. నా తలపైన ముసుగులేదు. తలవంచుకొనికూడాలేను. భయంతో కాదు, సంతోషంతో.....కాని రాత్రి సంతోషంతో ఆహ్వానించినశ్యామ ఇవ్వాళకన్నీళ్ళతో ఎదురైంది...

"బాబుగారూ! క్షమించండి. నా వల్ల ఊరంతా మీరు నిందలపాలయ్యారు. నన్ను నా స్థితిలోనే వుండనీయండి. నా వల్ల మీ కీర్తికి ముప్పుదెచ్చుకోకండి......వెళ్లండి..."

"శ్యామా! ఏమిటీ మాటలు. నేను సంఘానికీ, ప్రజలకు భయపడ్తాననుకున్నావా? నా ప్రతిజ్ఞను పూర్తి జేసుకోవడమే నా ముఖ్యోద్దేశము. నేను సంస్కరణ కంకణం కట్టుకొని బయలుదేరినప్పటి నుండీ, ఇంతవరకూ అన్నీ వుపన్యాసాలే కాని, ఒక్కటీ క్రియారూపకంగా చేసి చూపెట్టలేదు. ఇంతకన్నా మంచితరుణం నాకు మళ్ళీ జన్మానకూడా దొరకుతుందా?......శ్యామా! ఇల్లాంటి వెఱ్ఱిమాటలను లెక్కించకు త్వరగా సిద్ధంకా, ఇప్పుడే బయలుదేరుదాం......"

ఊరివెలుపల, అదే నదీతీరాన—ఎక్కడైతే మేం మొదటిసారి కలుసుకున్నామో—ఇప్పుడొక భవనం నిర్మింపబడివుంది. దాని 'రాంనివాస్' అని పేరు. అందులోనే నేనూ నా శ్యామ—కాదు. "కమల"—కమలానికీ శ్యామకూ అట్టే భేదంలేదు—వుంటున్నాము. మా నాన్న ఉదారస్వభావంవల్లనే ఇదంతా కలిగింది. మా జీవితాంతమువరకూ మాకే కష్టమూ లేకుండా వుండేట్టు ఏర్పాటు జేసిపోయాడు...... మేం ఇద్దరమూ ఎప్పుడూ ఆయన ఆత్మశాంతికొరకే దైవాన్ని ప్రార్థిస్తూ వుంటాము.